# కాటేసిన కాలనాగు

ప్రాతఃకాలం తెల్లని కాంతిపుంజాలతో తన విశాలమైన రెక్కలను లోకమంతా పరచింది. భారతదేశంలోని అన్ని గ్రామాలకు మల్లే ఆ కుగ్రామమూ తలెత్తి సూర్య నమస్కారం చేసింది.

గుడిసెముందు కళ్లాపి జల్లుతున్న రావులమ్మ చివరివరకూ పోయి "సాంబీ అరె! సాంబుగా! లేరా నాయనా, ఇయ్యాల పెందళాడే అడివి కెల్దువుగాని" అంటూ సాంబడు పడుకున్న మంచంమీదున్న గొంగళి లాగేసింది.

కుందేలు పొదలోంచి బయటపడ్డట్లుగా 'మే' అంటూ మేకపిల్ల రావులమ్మ మీద ఎగిరి దూకి మేకలదొడ్డి వైపు పరుగెత్తిపోయింది. "అరి నాయబ్బ సచ్చినాను" రావులమ్మ ఎగిరిపడింది. రావులమ్మ కేకకు సాంబడు లేచి కూర్చున్నాడు.

రావులమ్మ మేకపిల్ల పరుగెత్తుకు వెళ్ళినవైపు చూసింది. అది నేరుగా దొడ్డిలోకి పరుగెత్తింది. 'అరి నా బిడ్డకు ఎంత ఉరుకు జీవాలంటే' స్వగతంలో అనుకుంది.

సాంబడు త్వరత్వరగా దొడ్డి అంతా ఊడ్చి అంతా ఒకవైపు కుప్పగా పోశాడు. తరువాత తిరిగ్గా తన బుజ్జి మేకపిల్లను మనసారా చూసుకున్నాడు. దాని చిన్నారి కాలిగిట్టల చివరలను గిల్లి వేసాడు. దాని ముఖం మీద ముద్దులు పెట్టుకొన్నాడు. అది తన అమాయకమైన చూపులతో వింతగా దొడ్డంతా పరిశీలిస్తూ చెవులు మాటిమాటికీ తాటిస్తూ తిరుగుతుంటే వాడికెంతో ఆనందంగా ఉంది. నల్లని దాని బొచ్చుమీద తెల్లటిచారలు

చూస్తుంటే వాడికి మరీమరీ ముద్దొస్తూ ఉంది. అంతకుముందు రాత్రే పుల్ల మేక రెండు పిల్లల్ని పెట్టింది. ఆ రెంటిలో ఇది వీడ్ని ఆకర్షించింది. పనంతా అయిన తరువాత తాను ప్రక్కనే కూర్చుని జాగ్రత్తగా పుల్ల మేక దగ్గర పాలు తాగించాడు. అది సాంబడ్నే చూస్తూ తల్లిపాలు తాగింది. సాంబడు గుంజనానుకుని కూర్చొని దానిపైపే కళ్ళార్పకుండా చూస్తున్నాడు.

"ఆడు దొడ్లో ఉండడు. అడి దగ్గర కెళ్ళండి ఇస్తడు" రావులమ్మ వేసిన కేకకు ఇద్దరు ముగ్గురు పిల్లలు చెంబులతో దొడ్డిగుమ్మం ముందు నిలబడ్డారు.

సాంబడు యింట్లోకి వెళ్ళి పెద్ద చెంబుతెచ్చి నాలుగు మేకలను పిండి, అందరికీ పాలుపోసి పంపాడు. తరువాత ఒక్కగానొక్క రావులమ్మ ముద్దుల కొడుకయిన సాంబడు తన దినచర్యలో మునిగి పోయాడు.

* * * *

"నాయమ్మ. నువ్వు రాలేవు బుడ్డీ. ఈడనే ఉండి అమ్మ దగ్గర బాయి తాగు. నీకు మెత్తని గడ్డేసి పక్కేత్తిని గందా. దానిమీద తొంగో. అమ్మకు బోలెడన్ని మండలు ఎడితిని. తింటా ఉంటది. నీవు ప్రక్కనీ పడుకొని కావలసినన్ని బాయి తాగు. దొడ్డంతా ఎగురు. మద్దానం ఎండలో తిరగొద్దు. సీకటిపడి ఒచ్చేటప్పుడు నీకు కమ్మని కలేకాయలు తియ్యని గుంజి ఆకు తెత్తాను. అందాక జాగర్తగుండు. మరి నేనెలొత్తానేం...."

దాని వెన్ను మరీమరీ నిమిరి, నుదురు ముద్దుపెట్టుకొని బయలు దేరాడు సాంబడు. ఇంతకుముందే దొడ్డి వాకిలితీసి ఉంచడంవల్ల మేకలన్నీ అప్పటికే యింటి పరిసరాల్ని దాటాయి. దొడ్లో కట్టివేసి ఉన్న పుల్ల మేక, తనపిల్ల మేకను, సాంబడ్ని మార్చి మార్చి చూసింది. వాళ్ళిద్దరి అనుబంధానికి ఆశ్చర్యపోతున్నట్లుగా.

"ఓయమ్మో. నాను ఎల్లొత్తాను" భుజాన గొంగళి సర్దుకుంటూ అరిచాడు సాంబడు. ఒక చేతిలో మొద్దుకత్తి, మరొక చేతిలో కర్ర పట్టుకొని వాటి వెనుకనే బయలుదేరాడు.

అదొక పల్లెటూరు. సక్రమ మార్గంలేని సన్నని కాలువల్లాంటి ఇరుకుదార్లు. ఆ వూరికి బస్తీ యాభైమైళ్ళ దూరంలో ఉంటుంది. ఊరు పదిమైళ్ళ దూరం ఉందనగా బస్సు ఆగిపోతుంది. అక్కడ్నుంచి రావాలన్నా అక్కడకు పోవాలన్నా ఎడ్లబండి మీద పోవాలి. లేదంటే కాలినడకే.

ఊరికి పడమటి వైపున చెరువు. అక్కడనుంచి దట్టమైన అడవి ప్రారంభమవుతుంది. చెరువు క్రింద వ్యవసాయ మున్నప్పటికీ ఎక్కువ మెట్ట పైరులే పండిస్తారు ఆ వూరి వాళ్ళు. కారణం అది వర్షాధారం కావడమే. మేకలు మేపుకోవడం, వాటిని బస్తీలో అమ్ముకొని జీవించడం వాళ్ళ జీవనాధారాల్లో ముఖ్యమైనది

"అరె కర్రోడా! చెంచుగాడు, కుంటోడు, సెందురుడు ఎట్టా బోయిర్రురా ఇంకా రాలేదు."

"ఆరు గిపుడే రారుగాని సాంబా. మా నాయన కట్టెలు తెమ్మ నిండురా. అందుకని నేను పెందలాడ్నే మందనిప్పితిని."

ఇద్దరూ ఒకరి పక్కగా ఒకరు చెరువు గట్టుమీద నడవసాగారు. ముందు మేకలు పోతున్నాయి. కర్రోడు చెకుముకురాయి కొట్టి బీడీ వెలి గించాడు. "సాంబా. బీడీ తాగుతవంట్రా" అడిగాడు.

"నా కొద్దురా. ఆనక కూడు తిన్నాక తాగుతాను."

కొద్దిసేపటికి మేకలు చెరువులో దిగాయి. సాంబడు, కర్రోడు కూడా చెరువుకట్ట దిగి చెరువులో ప్రవేశించారు. చెరువు ఎండిపోయి ఉంది. చెరువు మధ్యలో మాత్రమే కొంత మేరకు నీళ్లున్నాయి. నీళ్ళ అంచునే నడవడం మొదలుపెట్టారు.

మేకలు అడవిలో ప్రవేశించగానే సాంబడు తను తెచ్చిన కత్తితో మండలు కొట్టడం ప్రారంభించాడు. కర్రోడు కట్టెలు కొట్టి అన్నీ ఒక చోటికి చేర్చసాగాడు. కొద్దిసేపటికి ఇద్దరూ మోపుల్ని చింతలగుంట దగ్గరకు చేర్చారు. చింతలక గుంట దాదాపు ఇరవైగజాలు వైశాల్య ముంటుంది. గుంటలో నాలుగడుగుల లోతున నీళ్ళున్నాయి. గుంట అంచు చుట్టూ గజం దూరం వరకూ ముళ్ళచెట్లన్నీ తొలగించి శుభ్రంచేసి పెట్టారు. చుట్టూ పెద్దపెద్ద చెట్లున్నాయి. వాటిలో నాలుగు నేరేడుచెట్లు, నాలుగు కుంకుడుచెట్లు ముఖ్యమైనవి. వాటి నీడనే మేకలు మేపుకొనే వాళ్ళంతా మధ్యాహ్నంపూట కొద్దిసేపు పడుకుంటారు. మేకలు వారిని అనుసరించి ప్రక్కనే చెట్లక్రింద పొదల్లో విశ్రాంతి తీసుకుంటాయి.

"అరె యాందిరా. సంటోడు యింకా కూడు తేలేదు. వస్తుండదేమో చెట్టెక్కి సూడండిరా."

అప్పటికే మేకల కాపరులంతా ఆ గుంటచుట్టూ చేరారు. వాళ్ళంద రికీ భోజనాలు రోజూకొకడు చొప్పున ఊళ్ళోంచి తేవాలి. వాడు వచ్చేది లేందీ, ఎంత దూరంలో ఉండేదీ చెట్టెక్కి చూస్తారు.

వీరిగాడి ఆజ్ఞ పాలించి కర్రోడు చకచకా నేరేడు చెట్టు ఎక్కాడు. అక్కడ నిలబడి తుండుగుడ్డ ఊపి, "రేయ్. సంటోడు సత్తాలేడురా. నాయాలు ఎప్పుడొత్తడో గాని, ఆడొచ్చేదాకా నీళ్ళలో ఈతగొడ్తాను" అంటూ కర్రోడు చెట్టు దిగాడు.

"నాను వస్తుండా పదరా" అన్నాడు సెంద్రడు. ఇద్దరూ ఒకరి తరువాత ఒకరుగా గుంట మొదట్లో ఉన్న దుబ్బుల్ని తప్పించుకుంటూ నీళ్ళలో దిగారు.

"అరె నాయాల్లారా! బుద్ధీ గ్యానం నేదురా మీకు ఇప్పటికి కూడు తిన్లేదు. నీళ్ళంతా కలిబెడుతున్నారు. బువ్వెట్లా తినాల్రా పందినాయాల్లారా" ముసలి రాగడు అరిచాడు.

“నేడు మావా! మేం యీ పక్కనే మునుగుతుంటిమి గందా. ఆ పక్క తేరనీళ్ళు ఉన్నయిలే తాగడానిక్కి” సెంద్రడు బుడుంగున తల నీళ్ళలో ముంచుతూ అన్నాడు.

“నాయాళ్ళ నెప్తే యిన్రు” మనసులోనే గొణుక్కున్నాడు రాగడు.

“అరేయ్ కూడొచ్చిందిరేయ్” అంటూ గట్టిగా అరచి, ‘అరె అందరూ మునుగుతుండరే నాను కూడా మునుగుదును’ అనుకుంటూ అప్పుడే వచ్చిన సంటోడు ఒకటొకటే కర్రకు తగిలించిన మూటల్ని క్రిందికి దించాడు.

“అరె సాంబుగా ఇట్టాగే కూసున్నవేరా ఆడ అందరూ మునుగుతూంటే” సాంబడు తను తెచ్చిన గొంగళిచెట్టు మొదట్లో పరచుకొని పడుకొని పైకి చూస్తున్నాడు. వాడికి ఎంత సేపటికీ తన బుజ్జిమేక గుర్తుకొస్తూ ఉంది. దాన్ని తనతోటే తెచ్చుకోనందుకు చాలా బాధపడిపోతున్నాడు.

కొద్దిసేపటికి గొర్రెల కాపరులయిన పిల్లలంతా గుంటలోంచి బయటకువచ్చి వళ్ళు తుడుచుకొని చెట్టునీడలో గుండ్రంగా కూర్చున్నారు. ఒకరి పచ్చళ్ళు ఒకరు పెట్టుకుని నవ్వులతో తమ అభిమానాన్ని పంచుకొన్నారు. తన బుజ్జిమేకను వళ్ళో కూర్చోబెట్టుకుని బువ్వ తినిపిస్తే ఎంత బాగుణ్ను అనుకున్నాడు సాంబడు.

* * * *

మరుసటిరోజు సాంబడు బుజ్జిమేకను తనతోబాటు అడవికి తెచ్చుకున్నాడు. భుజాన వేసుకుని నిమురుతూ అడవి అంతా చూపుతూ ఏదేదో చెబుతున్నాడు. మేకపిల్ల ముందు రెండు కాళ్ళను మెడకు ఒకవైపు, వెనుక రెండు కాళ్ళ ఇంకొకవైపు వేసుకున్నాడు. బుజ్జిమేకకు ఎండ తగలకుండా తన గొంగళి కప్పాడు. మేకలన్నీ పొలోమంటూ గ్రద్దల తిప్ప వైపు బయలుదేరాయి.

దారిలో ఎన్నో ఆకుల రుచులు చూపించాడు. కాయలు తినిపించాడు. రాక్షసుల గురించి, దయ్యాల గురించి, చిరుతపులుల గురించి తను విన్న కథలు వివరించి చెప్పాడు. అక్కడక్కడా పొదల్లో దూరి తేనె పట్టులు లాగి పెద్ద ఆకుల్లో పట్టాడు. మేకపిల్లను తన వడిలో కూర్చొబెట్టుకుని కొద్దికొద్దిగా తేనె నాలుకమీద వేసాడు. తరువాత మిగతాది తను తిని, దాని తలను రెండు చేతుల్తో ముద్దాడుతూ "మరెక్కువ తినగూడదమ్మా! జెరం వస్తాది. అనక మళ్ళీ పాలు తాగాలిగందా" అన్నాడు.

తరువాత దాన్ని చిన్నగా నడిపిస్తూ సాంబడు వెళ్తాంటే అది తన చిన్న చిన్న గిట్టలతో మెల్ల మెల్లగా నడుస్తూ తన పెద్ద కళ్ళను విచిత్రంగా తిప్పుతూ, తన బెత్తెడు తోకను మాటిమాటికి ఆడిస్తూ వాడి ముందు నడవసాగింది. నేలను ఆని ఉన్న గుబురు చెట్లలో దూరుతూ కొద్దిసేపు కనిపించకుండా లోపలే ఉండటం తరువాత బయటకువచ్చి వాడ్ని ఆశ్చర్యపరచడం, వాడి కాళ్ళచుట్టూ తిరగడం దానికి మహదానందంగా ఉంది. తన నాలుకతో చెట్టు ఆకుల్ని లాగి కొద్దిసేపు చప్పరించి ఊసేయడం, ఏదో వాసన చూసినట్లు నటించడం, 'మే' అని అరుస్తూ వాడి చేతుల్లోకి పోవడం, వాడు దాన్ని తన రెండు చేతులతో పట్టుకుని ముద్దు పెట్టుకొని మళ్ళీ వదిలేయడం ఇలా జరిగిపోసాగింది కాలం. అది వాడ్ని వదిలిపెట్టకుండా తన తల్లినే మరచిపోయినంత పనిచేసింది. పుల్ల మేక మాత్రం అప్పుడప్పుడూ పొదల్లోంచి బయటికి వచ్చి ఒకసారి తన బిడ్డను చూసుకొని మళ్ళీ పొదల్లో దూరేది.

తన మేకపిల్లలేని జీవితం తనకు అవసరం లేదనుకున్నాడు సాంబడు. తన బంగారు మేకపిల్లకు అడవిలోని రకరకాల చెట్ల కొమ్మలతో పర్ణశాల నిర్మించాలనుకున్నాడు.

ఆ రోజు మధ్యాహ్నం ప్రొద్దు నెత్తిమీది కొచ్చిందనగా చింతల గుంట దగ్గరకు అందరూ నాలుగువైపుల నుంచి వచ్చి చేరారు. మేకలు

చుట్టూ ఉన్న పొదల్లో దూరాయి. కొన్ని మేకలు అటూ ఇటూ అరుస్తూ తిరుగుతున్నాయి.

"అరె సాంబుగా ఎందుకురా బుజ్జికూనను తెచ్చి ఎండలో ఇట్టా తిప్పతవు" వీరిగాడు అరిచాడు.

"నేదు మావా! ఎండ తగలకుండా జాగ్రత్తగా సూత్తుండాను ఇకన తీసకరాన్లే."

"అప్పుడే సూడు కూన ఎంత ఇదయిపోనాదో. ఇంత ఎండ అది ఎట్టా ఓర్చుకోగల్దు. మనమే సూడు ఎండిన సేపయిపోనాము.... కర్రోడు సెప్పిన మాట ఎట్టా ఇన్దవోక్క" వీరిగాడు మళ్ళీ అన్నాడు.

"దానికి నా దగ్గర సనువెక్కువయింది మావా. అదీ నన్నొదిలి పెట్టి ఎల్లదు. అందుకని తీసికొస్తిని. ఇక నాను తీసకరాన్లే. మిగతా పిల్లల్తో వదలిపెడ్తాను" సాంబడు సంజాయిషీ ఇచ్చుకొన్నాడు.

ఇంతలో వాళ్ళందరకూ భోజనాలు వచ్చాయి. కొద్దిసేపట్లో అందరూ భోజనాలు ముగించారు. సాంబడు చెట్టు మొదట్లో గొంగళి పరచి పడుకున్నాడు. ప్రక్కనే బుజ్జిమేక పడుకుంది. వాడు దానిపైన జాగ్రత్తగా చేయివేసి పడుకుని ఏదేదో ఆలోచనల్లో మునిగిపోయాడు. 'నాను వీరిగాడి మాటవిని అకు సెప్పినట్టు పిల్లను ఇంటికాడ వొదిల్రాను. కర్రోడు రోజూ తెస్తుండడు. ఏమయిందేటి దానికి' అనుకున్నాడు.

అందరూ మేకల్ని వేరే దిశకు మళ్ళించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇంతలో సూర్యభగవాణుడ్ని శతృవుల్లా తమ కబంధహస్తాల్లో బంధించి వేసాయి మబ్బులు. అంతవరకూ పచ్చగా మెరుస్తున్న చెట్ల ఆకులు వెలవెలాబోయి చూడసాగాయి. చిక్కగా ఉన్న చెట్ల పొదల్ని చూస్తూ ఇంకా చిక్కగా పెనవేసుకున్నాయి మబ్బులు. అంధకారంలో ఆశా జ్యోతిలాగా మెరుపులు అప్పుడే ప్రారంభమయ్యాయి. సన్నని చిరుగాలి బరువైన పెనుతుపానుగా మారింది. అంతవరకు ఎండకు ఎండిన

వృక్షాగ్రాలు తమకు జరగబోయేదీ శుభమో, ప్రళయమో తెలియక తల లూపుతున్నాయి. అడవిలో పక్షులు, జంతువులు తమ తమ నివాసాల్ని పదిలం చేసుకుంటున్నాయి.

చిమ్మచీకట్లు నలువైపులా చుట్టుకున్నాయి. వర్షం మొదలయ్యింది. మేకలు చెల్లాచెదరై అడవంతా పరుగులు తీస్తున్నాయి. ఎవరికి వాళ్ళు తమ ప్రాణాల్ని రక్షించుకుంటూ ఒకరినొకరు పిలుచుకుంటున్నారు. వాళ్ళమాటలు వాళ్ళకే వినిపిస్తున్నాయి. చిన్న కాలి బాటలన్నీ సెలయేర్లయ్యాయి. అడవిలో కురిసే వర్షమంతా చిన్న చిన్న పాయలై కాలువలుగా మారి చెరువువైపు పరుగిడుతున్నాయి. అలవాటయిన దారి కాబట్టి అంతా ఒకే దిశకు రాగలిగారు. ఒకరినొకరు తడుముకుంటూ ఒకరి చేతులు ఒకరు పట్టుకుని చెరువు కట్టమీది మర్రిచెట్టును చేరుకున్నారు. అందరూ విశాలమైన దాని మొదలు క్రింద తల దాచుకోసాగారు. సాంబడు ఆ వర్షంలోనే ఎలాగో తన మేకపిల్లను తెచ్చుకున్నాడు. తలకు చుట్టుకున్న తుండుగుడ్డ తీసి దాని వళ్ళంతా కప్పాడు. అంతేగాక దాన్ని తను కప్పుకున్న గొంగళిలోకి చేర్చాడు. అందరూ ఒకరినొకరు పరామర్శించుకున్నారు. సాంబడు చేతిలోని మేకపిల్లను చూసి అందరూ నవ్వారు.

"ఆరి నీయమ్మ అందరం జీవాల్నొదిలి పానాల్ని గుప్పెట్లో పెట్టుకొత్తే, ఆడు మేకపిల్లను భద్రంగా తెచ్చుకున్నాడు పారెయ్యేహె దాన్ని....మనపానం కాడికి ఎక్కువేటి ? ....నాను నా పిల్లను అక్కడే పారేసి రాలా" వణకుతూ వణకుతూ అన్నాడు కర్రోడు. వాడి మాటలకు అందరూ మరొకసారి నవ్వారు.

సాంబడు మరేం మాట్లాడలేదు. 'తనకు పానమయిన కూన దక్కింది. మేకలు బతికేవయి. ఇంటికొస్తయి. మిగతాయి సస్తయి వర్షా కాలం ఇది మామూలే' అనుకున్నాడు. దాని తలను ప్రేమగా నిమిరి

బయటకు తీసాడు వళ్ళు తుడుద్దామని. ఇంతలో ఒక మెరుపు మెరిసింది. ఆ అద్భుత కాంతికి సాంబడి నరాల్లో విద్యుచ్ఛక్తి ప్రవహించింది. గుండెలో వేయి బాంబులు ఒక్కసారిగా పేలాయి. వాడి చేతిలోని మేకపిల్ల జారి క్రింద పడింది. అదీ చలికి వణుకుతూ చెట్టు మొదట్లో ఒక మూల జేరింది.

సాంబడి వళ్ళు చెమటతో నిండిపోయింది. తను పొరపాటున బుజ్జి కూనను వదలి ఆ చీకట్లో కర్రోడి మేకపిల్లను తెచ్చాడు. తన గతేంకాను? రేపటినుంచి తన కూన లేకుండా తను బ్రతకలేడు. అంతే....పిచ్చిపట్టిన వాడిలా పరుగెత్తసాగాడు సాంబడు. వెనుకనుంచి మిగతావాళ్ళ పిలుపులు వాడినేం చేయలేకపోయాయి. చెరువుకట్ట చివరివరకూ పోయి చెరువు అంచునే అడవిలోకి పరుగెత్తసాగాడు....అప్పటికి వర్షం ఆగిపోయింది.

చిన్న చెట్లు, పొదలు కనిపించకుండా నీళ్ళు పారుతున్నాయి. దారి, డొంక, కాలువ ఏమీ తెలియడంలేదు. సాంబడు గుండెలలోతు నీళ్ళలో పడుతూ లేస్తూ నడుస్తున్నాడు. చివరకు ఎలాగో చింతలగుంట దగ్గరకు చేరాడు. వాడి ఒళ్ళంతా ముళ్ళతో చీరుకుపోయి రక్తచందనం పూసినట్లుగా ఉంది. తలలోంచి కారుతున్న నీళ్ళను ఒక చేత్తో తుడుచుకుంటూ నలు దిక్కులా పిచ్చిగా చూస్తున్నాడు.

వాడు చదువుకున్నవాడు గాదు. నాగరికత తెలిసినవాడు గాడు. కాని ఈ నవ నాగరిక ప్రపంచంలో శూన్యమైన ప్రేమించేగుణం వాడిలో ఉంది. ఆ ప్రేమకోసం తపించే హృదయముంది. ఇదీ చరిత్ర చెప్పని పాఠం. వాడికి తన విశాలమైన కళ్ళతో అమాయకంగా చూసే మేకపిల్ల కావాలి.

ఆకాశం నీలిరంగులో ముఖం కడుక్కొన్నట్లు నిర్మలంగా ఉంది. అక్కడక్కడా చిన్న చిన్న మేఘాలు కదులుతున్నాయి. ఆ మేఘాల

వెనుక ప్రకృతి, భయంకరమైన కాలనాగులా ఇలా అల్లలాడిస్తుందని ఎవరికి తెలుసు. సూర్యుడి నిష్క్రమణను తెలియజేస్తూ, సంధ్యాకాంతి ఒక్కసారి కనిపించి మాయమయ్యింది.

సాంబడి బుజ్జిమేక ఆ వర్షంలో వాడిని తప్పించుకొని ఒక పొదలో దూరిందనీ, వర్షం మొదలయిన కొద్దిసేపటికే అది చచిపోయిందని వాడికి తెలియదు తరువాత దాని శవం ప్రవహించే పిల్లకాలువలో కొట్టుకొని పోయి గుంటలో చేరడం, అది నిండి, ఆ సమీపంలోని ఎర్రకాలువతో కలవడం, ఎర్రకాలువ ఎంతో జాగ్రత్తగా దాని భౌతిక కాయాన్ని చెరువు మధ్యకు చేర్చిందని వాడికేం తెలుసు ? తనకూ ఆ ఎర్రకాలువ వీడ్కోలు ఇస్తుందని ఊహించలేకపోయాడు సాంబడు.

సాంబడు తన కెదురుగా చిన్న చెరువులా కనిపిస్తున్న చింతల గుంట వైపొకసారి నిరాశగా చూసి వెనుకకు తిరిగి రెండడుగులు ముందుకు వేసాడు. అది ఎర్రకాలువ అంచనీ, పైన్నుంచి నీటి ఉధృతం ఎక్కువవు తుందనీ ఊహించలేదు. మరి రెండడుగులు ముందుకు వేసాడు అంతే....

సాంబడి కాళ్ళకు గట్టు తగల్లేదు.

✻✻